హెచ్‌పీసీఎల్ ఎన్‌రిచ్‌మెంట్ ప్రోగ్రాంలో ఆదర్శ్ అధ్యాపక సిబ్బంది

విశాలాంధ్ర - పెందుర్తి : హెచ్‌పిసిఎల్. స్కిల్ డెవలప్మెంట్ సంస్థ సిఈఓ అండ్ సెక్రటరీ ఇంతియాష్ ఆధ్వర్యాన, పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఎస్డిఐ టీం ఫ్యాకల్టీ ఎన్రిచ్మెంట్ ట్రైనింగ్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ఈ ఫ్లోరా తెలియజేశారు. ఈ ప్రోగ్రాంలో ఆదర్శ్ కళాశాలకు చెందిన 40 మంది అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారని, ఈ అవగాహన సదస్సులో అధ్యాపకులు ప్రాబ్లం సాల్వింగ్, క్రియేట్ సిచ్యువేషన్ వేర్ జడ్జిమెంట్ ఇన్ మినిమల్, స్పాట్ అనాలసిస్, లెస్ ఎఫెక్ట్స్ లెస్ గైన్, తదితర అంశాలపై విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జి అందించినట్లు ప్రిన్సిపల్ తెలియ చేసారు. ఈ సందర్భంగా ఆదర్శ కాలేజీ కరస్పాండెంట్ టీ.థీయో ఫిలష్ మాట్లాడుతూ ఫ్యాకల్టీ ఎన్‌రిచ్ మెంట్ ప్రోగ్రాం ద్వారా నూతన టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన ఏర్పడిందని, ఈ కార్య క్రమంలో ప్రజలకు ఎంతో ఉపయోగపడిందని వెల్లడించారు.

స్టీల్ ప్లాంట్‌ని ప్రభుత్వ రంగంలోనే నడపాలి

నడ్డా పర్యటన సందర్భంగా సీపీఐ నిరసన

విశాలాంధ్ర - విశాఖ : విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సిపిఐ డిమాండ్ చేసింది. బిజెపి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విశాఖ పర్యటన సందర్భంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించింది. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అత్తిలి విమల, రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.పైడిరాజు, జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేటుపరం చేయడం లేదని కూటమి ప్రభుత్వం చెబుతోందన్నారు. దీనిపై నడ్డా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. విభజన హామీల అమలు, విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ఎప్పటినుండి ప్రారంభిస్తారని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడం లేదని కూటమి ప్రభుత్వం చెబుతోందని, అలాంటప్పుడు స్టీల్ ప్లాంట్‌లోని 43 విభాగాలకు ఎక్స్ ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ఆహ్వానించడం వెనుక అంతరార్థం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు స్టీల్ ప్లాంట్ ని విస్మరించి అనకాపల్లి జిల్లాలోని మిట్టల్ స్టీల్ ప్లాంట్ కి అన్ని అనుమతులు కోసం కృషి చేయడం దారుణమని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ని ప్రైవేటీకరిస్తే ప్రజాప్రతినిధులు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసరావు, కే వనజాక్షి, ఎండి బేగం, ఎం మన్మథరావు, సిఎం క్షేత్రపాల్, ఎన్. నాగభూషణం, వై. రాంబాబు, ఏ దేవుడమ్మ, బి.పుష్పలత, కె. లక్ష్మణరావు, జి.జయ, ఏ. ఆదినారాయణ, పి.గోవింద్, జి. రాంబాబు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : వాయువ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల్లో అల్పపీడనం స్థిరంగా కొనసాగుతుంది. శనివారం కూడా ఆకాశంలో మేఘావృతమై అక్కడక్కడా తేలికపడి జల్లులు కురిసాయి. అల్పపీడనం ప్రభావంతో ఆదివారం అక్కడక్కడ తేలికపాటి జల్లులు,మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న 48 గంటల్లో దక్షిణఒడిశా, ఉత్తరాంధ్ర, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని వెల్లడించారు. దీనికి అనుబంధంగా ఛత్తీస్‌గఢ్, విదర్భ మీదుగా దక్షిణ మహారాష్ట్ర వరకు లిద్రోణిలి కొనసాగుతుందన్నారు. తీరం వెంబడి 30-40 కిమీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద నిలబడరాదని సూచించారు.

చేనేత విభాగం వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వానపల్లి ఈశ్వరరావును అభినందించిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ : చేనేత విభాగం వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన వానపల్లి ఈశ్వరరావును తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావుతో పాటు నేతలు శనివారం అభినందించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో, రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన వానపల్లి ఈశ్వరరావు సీతమ్మధార తూర్పు నియోజకవర్గం కార్యాలయంలో, సమన్వ యకర్త మొల్లి అప్పారావునీ పూర్వకంగా కలిసి ధన్య వాదాలు తెలియజేశారు. అనంతరం మొల్లి అప్పారావు మాట్లాడుతూ, కష్టపడిన కార్యకర్తలు ప్రతీ ఒక్కరికి పార్టీలో సముచితస్థానం కల్పిస్తారని, అందులో భాగంగా మన వైసిపి సీనియర్ నాయకులు వానపల్లి ఈశ్వరరావుకి సముచిత స్థానం కల్పించడం జరిగినదని చెప్పి, వారికి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు 13 వవార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్, గూడపాటి విక్టర్, తూర్పు నియోజకవర్గం బిసి విభాగం అధ్యక్షుడు బేతా దుర్గారావు, కాకర గోవింద్, వంకర బాబురావు, శ్రీను, సూకీ సురేష్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

క్రికెటర్ ఎంఎస్ఆర్ మూర్తి సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - పీఎం పాలెం : తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన క్రికెటర్, లెఫ్ట్ హ్యాండ్ స్పిన్నర్ మాజీ ఆంధ్రా రంజీ క్రికెట్ ప్లేయర్ ఎం.ఎస్.ఆర్. మూర్తి (73) మృతిపై ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఏసీఏ కార్యదర్శి, రాజ్యసభ ఎంపి సానా సతీష్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం ఆంధ్రప్రదేశ్ క్రికెట్ రంగంలో తీరని లోటని ఏసీఏ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ లో నివాసం వుంటున్న ఎం.ఎస్.ఆర్. మూర్తి వయోభారం కారణంగా శుక్రవారం మృతి చెందారు.ఎం.ఎస్.ఆర్. మూర్తి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని కోరుకుంటూ శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు ఏసీఏ తరపున ఏసీఏ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని),రాజ్యసభ ఎంపి సానా సతీష్ తన ప్రగాఢ సానుభూతి తెలియజేయటంతోపాటు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఎం.ఎస్.ఆర్. మూర్తి తను చదువుకునే సమయంలో హైదరాబాదు స్కూల్స్, సౌత్ జోన్ స్కూల్స్, హైదరాబాద్ జూనియర్స్ తరపున మెరుగైన ప్రదర్శన చేసి, ప్రతిభను నిరూపించారన్నారు.. అనంతరం కాకినాడ ఇంజనీరింగ్ కళాశాలలో చేరి, జేఎన్‌టియు కళాశాలలకు కెప్టెన్‌గా కొనసాగుతూ, సౌత్ జోన్ యూనివర్సిటీ జట్టును కూడా ప్రాతినిధ్యం వహించారని పేర్కొన్నారు. ఎం.ఎస్.ఆర్. మూర్తి ఇంజనీరింగ్ పూర్తి చేసిన తరువాత ఈసీఐఎల్ సంస్థలో ఉద్యోగం చేస్తూ, హైదరాబాదు లీగ్ మ్యాచ్‌లలో పాల్గొన్నారని తెలిపారు. ఆ తర్వాత ఆయన స్వంత వ్యాపారాన్ని ప్రారంభించి, క్రికెట్ కు అంకితమై ఎనలేని సేవలు చేశారన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఆంధ్రా రంజీ మ్యాచ్‌లో అగ్రశ్రేణి ఆటగాడిగా మంచి గుర్తింపు పొందిన ఎం.ఎస్.ఆర్. మూర్తి నేటితరం క్రీడాకారులకు ఆదర్శమన్నారు.

బీజేపీలోకి ప్రముఖ న్యాయవాది 'మళ్ల తులసీరాం'

విశాలాంధ్ర - విశాఖ సిటీ : విశాఖ నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది మళ్ల తులసీరాం శనివారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. విశాఖ పార్టీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ సందర్భంగా మళ్ల తులసీరాంకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రధాని మోడీని ఆదర్శంగా తీసుకుని, బీజేపీకి ఆకర్షితుడినయ్యానని ఈ సందర్భంగా మళ్ల తులసీరాం పేర్కొన్నారు. తులసీరాం 1999నుంచి 2008 నుంచి ఎన్ఎస్‌యూఐలో పని చేశారు. ఆ సంఘం విశాఖ నగరాధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత అనకాపల్లి పార్లమెంటరీ సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మరో నాలుగేళ్ల పని చేశారు. పీసీసీ లీగల్ సెల్ సభ్యుడిగా 2015 నుంచి 2017 వరకు పని చేశారు. ఆ తర్వాత వైసీపీలో చేరి ఆ పార్టీ లీగల్ సెల్ సభ్యుడిగా కూడా పని చేశారు.

యువజన సంఘం నేతగా : విద్యార్థి సంఘ నాయకుడిగా, యువజన సంఘం నేతగా మళ్ల తులసీరాం చాన్నాళ్లు పని చేసి అందరి మన్ననలు పొందారు. జీవీఎంసీ స్టాండిరగ్ కౌన్సిల్ (ఎమ్మెస్సీ)గా బాధ్యతలు తీసుకుని అనేక కేసుల్ని పరిష్కరించారు. విశాఖ నగరంలో ప్రముఖ న్యాయవాదిగా పేరొందారు. బీజేపీలో చేరిన సందర్భంగా మోడీ, అమిత్‌షాతో పాటు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఏపీ బీజేపీ ఉపాధ్యక్షులు ఆడారి ఆనంద్ కుమార్, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు ఎంఎన్ పరశురామరాజు తదితరులకు మళ్ల తులసీరాం కృతజ్ఞతలు తెలియజేశారు.

క్యాన్సర్ నియంత్రణ వ్యాక్సినేషన్ శిబిరానికి అనూహ్యమైన స్పందన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : సీతమ్మ ధారలోని లయన్స్ క్యాన్సర్ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ 9 నుండి 14 ఏళ్ల వయస్సు గల ఆడపిల్లలకు శనివారం నిర్వహించిన గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణ ఉచిత వాక్సినేషన్ శిబిరానికి అనూహ్యమైన స్పందన లభించింది. ఈనెల 13 నుండి 16 తేదీ వరకు టీకాలు వేయాల్సి ఉండగా తొలి రోజునే 300 మందికి పైగా ఆడపిల్లలు వ్యాక్సిన్ వేసుకున్నారు. 670మంది ఆడపిల్లలు తమ పేర్లను ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు మరియు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ ఆడపిల్లల్లో క్యాన్సర్ ను నియంత్రించేందుకు ఈ వ్యాక్సినేషన్ శిబిరాన్ని నిర్వహించామని చెప్పారు. ఆరు నెలల వ్యవధిలో రెండు డోసులు వేస్తున్నామని ఇది ఖర్చుతో కూడుకున్న పని అయినప్పటికీ సామాజిక సేవా దృక్పథంతో ఉచితంగా వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలియజేశారు. మున్ముందు మరిన్ని శిబిరాలు నిర్వహించి ఆడపిల్లలకు ఈ క్యాన్సర్ రాకుండా ఉండేందుకు తగు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు ఈ శిబిరంలో లైయన్స్ క్యాన్సర్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు,లయన్స్ క్లబ్ అఫ్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి రవిచంద్ర, డాక్టర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల బార్ లైసెన్సులు లాక్కున్న వెలగపూడి : ప్రియాంక దండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ అండతో విశాఖ జిల్లా కల్లు గీత కార్మికులకు చెందాల్సిన బార్ లను ఎమ్మెల్యే వెలగపూడి లాక్కున్నారని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రియాంక దండి ఆరోపించారు. ఈ మేరకు ఆమె ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం 10 బార్ అండ్ రెస్టారెంట్ లైసెన్స్ ఇస్తే అందులో 4 తూర్పు నియోజకవర్గనికే దక్కేలా వెలగపూడి రామకృష్ణ బాబు ప్రభుత్వంలో చక్రం తిప్పారన్నారు. కల్లుగీత సామాజిక వర్గానికి చెందిన వంశీ (రవీంద్ర నగర్), అప్పలరాజు (వెంకోజీపాలెం), సంపంగి వాసు (హెచ్ బి కాలనీ), అప్పారావు (హెచ్ బి కాలనీ) హెచ్ బి కాలనీ నివిసితులకు ఇద్దరికి లైసెన్స్ వచ్చిందన్నారు. వీరి పేరు మీద లైసెన్స్ తీసుకొని వెలగపూడి తన భీనామీలతో ఈ బార్‌లు నడుపుతున్నట్టు తెలుస్తోంది అన్నారు. వెలగపూడి అక్రమాలకు అడ్డు లేదని, చివరికి కల్లు గీత కార్మికులను కూడ తన లిక్కర్ దందా వాడుకుంటున్నాడని, నియోజకవర్గంలో పలు చోట్ల మద్యం బెల్ట్ షాపులు కూడ యదేచ్ఛగా నడిపిస్తున్నారన్నారు. తోటగరువు హై స్కూల్ పక్కన ఉన్న ఒక చిన్న బడ్డీ బెల్ట్ షాపుగా తయారు చేసి మద్యం అమ్ముతున్నాడని పైగా ఆ బడ్డీ యజమాని జీవీఎంసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడని నాకు స్థానికులు సమాచారం ఇచ్చారన్నారు. అతనికి వెలగపూడి మద్దతు ఉండటంతో స్థానికులు ఏమి చేయలేకపోతున్నారని ఆమె అన్నారు. జిల్లా ఎక్సైజ్ ధికారులు వెంటనే విచారణ జరిపి నిజమైన లబ్ధిదారులకు అందించాలన్నారు. బెల్ట్ షాపులు తొలగించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెలగపూడి లిక్కర్ మాఫియా మీద పోరాటాలు చెప్పడతామని ప్రియాంక హెచ్చరించారు.

మధురవాడకు మహర్ధశ...

రూ.1.72 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - పీఎంపాలెం : శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడలో రూ. వెయ్యి కోట్లతో రెండు కీలకమైన ప్రాజెక్టులు మొదలు కాబోతున్నాయని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 6 వ వార్డులో రూ. 1.72 కోట్లతో ప్రతిపాదించిన రోడ్లు, డ్రెయిన్లకు వైభవ్ నగర్‌లో శనివారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రూ. 535 కోట్ల ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐ.ఎఫ్.సి.) నిధులతో 38 ఎం.ఎల్.డి. సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంటు.. 400 కిలో మీటర్ల పొడవున సీవేజ్ లైన్.. నిర్మాణం చేపట్టనున్నట్టు చెప్పారు. ఇందులో రూ. 498 కోట్లు ఐ.ఎఫ్.సి. ఇస్తుండగా, మిగిలిన మొత్తాన్ని జీవీఎంసీ భరిస్తుందని వివరించారు. భవిష్యత్‌లో మధురవాడకు తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా రూ. 500 కోట్లతో భారీ ప్రాజెక్టుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఇవి కాకుండా మధురవాడ జోన్ లో రూ. 120 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు తదితర మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ప్రారంభమైన తర్వాత మధురవాడ అభివృద్ధి పుంజుకుంటుందన్నారు. భీమిలిలో ప్రధానమైన మూడు రోడ్ల విస్తరణ.. జీవీఎంసీలో భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాల విలీనం ప్రతి పాదనలు తొందర్లోనే కార్యరూపం దాల్చనున్నాయని వెల్లడించారు. జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్ లతో మున్సిపల్ మంత్రి పి.నారాయణ సమావేశం కాను న్నారన్నారు. అనంతపురం కూటమి సభ విజయ వంతం కావడంతో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ప్రారంభించిన 17 మెడికల్ కాలేజీల్లో అయిదు మాత్రమే పూర్తయ్యాయని.. రుషికొండ ప్యాలెస్ నిర్మాణానికి ఖర్చు చేసిన రూ. 500 కోట్లతో నర్సీపట్నం మెడికల్ కాలేజీని పూర్తి చేసి ఉండ వచ్చన్నారు. జగన్మోహన్ రెడ్డి వైఖరి మార్చుకోకపోతే రాబోయే ఎన్నికల్లో వైసీపీ సింగిల్ డిజిట్‌కు పరిమితమవుతుందని చెప్పారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలు వైభవ్ నగర్ లో రెండు పార్కుల గేట్లకు తాళాలు వేసిన విషయం స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే తాళాలు తీసి.. నిర్వహణ బాధ్యతను కాలనీ అసోసియేషన్ కు అప్పగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ కురుమిన రామస్వామి నాయుడు, కార్పొరేటర్లు మొల్లి హేమలత, లొడగల అప్పారావు, కూటమి నాయకులు దాసరి శ్రీనివాస్, లొడగల జానకిరామ్, గంటా నూకరాజు, శాఖారి శ్రీనివాస్, అక్కరమాని వెంకట్రావు, పిల్లా వెంకట్రావు, కె.అచ్యుతరావు, నాగోతి సత్యనారాయణ, మామిడి దుర్గారావు, మొల్లి లక్ష్మణరావు, చెట్టుపల్లి గోపీ, బోయి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలను ప్రారంభించిన గంటా..

మధురవాడ జాతరలోని శిల్పారామంలో 9 వ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఆనంద్ తైక్వాండో అండ్ మార్షల్ ఆర్ట్స్, వైజాగ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బౌట్ ను ప్రారంభించి పోటీలను తిలకించారు.

2 చోరీ కేసులను చేధించిన పెందుర్తి పోలీసులు

ఇద్దరు నిందితులు అరెస్ట్.. రూ.20 లక్షల సొత్తు స్వాధీనం

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి పోలీసులు 20 లక్షల చోరీ కేసులను చాకచక్యంగా చేధించారు. నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వెస్ట్ సిఐ కే. శ్రీనివాసరావు పెందుర్తిలో మీడియాకు వెల్లడించారు. సత్తివానిపాలెంలో నివాసముంటున్న కొయ్యాన క్రుష్ణ పరవాడలో ఓ కంపెనీలో ఇంజినీరుగా ఉద్యోగం చేస్తున్నారు. 2022 ఫిబ్రవరిలో తమ ఇంటిలో దొంగతనం జరిగినట్లు ఆయన ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేపట్టి అదే ప్రాంతంలో నివాసముండే నిందితురాలు చిన్నపల్లి సుజాతను అరెస్ట్ చేసి 200 గ్రాముల బంగారం, 40 తులాలు వెండిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. అలాగే మరోకేసులో రాయుడు దుర్గాభవానీ, ఈ ఏడాది జూన్ 24న, బ్యాంకులో కుదువ పెట్టిన బంగారం విడిపించుకొని ఆటోలో ప్రయాణిస్తుండగా ఆ పరుసు దొంగిలించిన కేసులో కొత్తవలస మండలం, ముసిరాంకు చెందిన మాకిరెడ్డి గణేశ్ ను అరెస్ట్ చేసి 6.5 తులాలు బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలియచేసారు. ఈ కేసులలో చురుగ్గా వ్యవహరించిన పోలీసులను కమిషనర్ శంఖబ్రతబాగ్చీ, క్రైమ్ డీసీపీ లత మాధురి అభినందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - పెదగంట్యాడ : 75వ వార్డు పరిధిలోని పెద గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణములో టెస్టుల కోసం సుమారు 50 లక్షల రూపాయలతో నూతనముగా నిర్మించిన లాబొరేటరీస్ భవనాన్ని గాజువాక నియోజక వర్గ శాసన సభ్యులు మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర టీడీపి అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. 75వ వార్డు కార్పొరేటర్ శ్రీమతి పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమము జరిగింది. డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రాజు హాస్పిటల్ సిబ్బంది, వైద్యులు సంపత్ కుమార్, హేమ లత స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు. సుమారు కోటి అరవై లక్షల విలువైన అభివృద్ధి పనులకు శ్రీ పల్లా శ్రీనివాస రావు చేతుల మీదుగా శంకుస్థాపనలు చేసారు. వార్డు కార్పొరేటర్ శ్రీమతి పులి లక్ష్మిబాయి వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ వార్డు అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న గాజువాక శాసన సభ్యులు మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర టీడీపి అధ్యక్షులు శ్రీ పల్లా శ్రీనివాస రావు గారికి ధన్యవాదాలు తెలుపుతూ త్వరలో పెద గంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దడంలో, రోడ్డు విస్తరణ ప్రక్రియ వేగవంతములో, పెద గంట్యాడ శ్మశాన వాటిక నిర్మాణం పూర్తి చేయడములో, నెల్లి ముక్కు జీవీఎంసీ మైదానాన్ని అభివృద్ధి చేయడములో పూర్తి సహాయ సహకారాలు అందించి వేగముగా పనులు జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమములో గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి స్థానిక కూటమి నాయకులు విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి 75వ వార్డు టీడీపీ అధ్యక్షులు నమ్మి అప్పారావు, 75వ వార్డు జనసేన అధ్యక్షులు కోన చిన అప్పారావు ఇతర నాయకులు శ్రీమునిరి శ్రీనివాస రావు, పెద్దాడ సోము నాయుడు,నూకరాజు, వరలక్ష్మీ,,కణితి సన్యాసమ్మ, బస అప్పల రెడ్డి, పుష్ప ములకలపల్లి వంశీ, మొల్లి అప్పారావు, ఊరుకుటి అప్పారావు, మొల్లి సోము నాయుడు, సుదమల్ల ప్రసాద్, దాసరి జ్యోతి రెడ్డి,దొమ్మేటి పెరుమాళ్, సోము నాయుడు, కనక రాజు, కడవల రమణ, నామాల అర్జున్,టీ అప్పారావు, పెంటయ్య, పాము తాతారావు, సీరపు వెంకట రావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

శ్రీ ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రంలో చతుర్థి తిరు పవిత్రోత్సవ ఆహ్వాన శుభపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - భీమిలి : భీమిలి, బ్యాంకు కాలనీ వద్ద ఉన్న శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రంలో స్వామి వారి "చతుర్థ తిరు పవిత్రోత్సవాలు అక్టోబర్ 5 నుంచి 8 వరకు ఘనంగా జరగనున్నట్లు ఆలయ ట్రస్టీస్ తెలిపారు. ఈ మేరకు స్వామి వారి చతుర్థి తిరు పవిత్రోత్సవాలు ఆహ్వాన శుభ పత్రిక" కరపత్రిక, గోడపత్రిక శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీస్ కలిగొట్ల శ్రీరామ చంద్ర మూర్తి, కలిగొట్ల సూర్య నారాయణ మూర్తి, కలిగొట్ల బానోజిరావు, కలిగొట్ల శ్రీనివాసరావు, వి. తాతాజీ, ఆలయ అర్చకులు పురాణం శేషాచార్యులు మాట్లాడుతూ పవిత్ర ఉత్సవాలు అక్టోబర్ 5 నుండి 8 వరకు ఘనంగా జరగనున్నాయని, పుర ప్రజలు, భక్తులు పాల్గొని స్వామి వారి దివ్యాశిస్సులు పొందగలరని కోరారు.

మానసిక ఉల్లాసానికి విద్యార్థులకు క్రీడలు ముఖ్యం

విశాలాంధ్ర - ఆనందపురం : విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలని జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు, వేముల వలస పంచాయతీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. ఆయన విశాఖ జిల్లా నుండి రాష్ట్రస్థాయి టీంకు ఎంపిక కాబడిన వారికి అతని సొంత నిధుల నుండి టీ షర్టు సమకూర్చి అందజేశారు. ఈ సందర్భంలో మాట్లాడారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యత పెరుగుతుందన్నారు. తూర్పుగోదావరి జిల్లా కోనసీమలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు మన జిల్లా నుండి ఎంపిక కావడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్‌తో పాటు టెన్నికాయిట్ అసోసియేషన్ ట్రెజరర్ కొట్యాడ శ్యామ్ కుమార్, కార్యదర్శి కె.రాజేష్, సీనియర్ ప్లేయర్ కడగళ్ల నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తవిటి కొండలో స్థలాలు ఆక్రమణ

- ఎకరా భూమిపై కన్నేసిన బడాబాబులు
- ప్రభుత్వ స్థలంలో రాత్రికి రాత్రే నాటిన నీలగిరి మొక్కల
- చర్యలు తీసుకోండి అధికారులకు స్థానికుల విజ్ఞప్తి

ప్రస్తుతం స్థలంలో నీలగిరి మొక్కలు

విశాలాంధ్ర

తవిటికొండలో గ్రావెల్ మాయం...!

ఇదివరకు పత్రికలో ప్రచురించిన కథనం

విశాలాంధ్ర - అనందపురం : ఆనందపురం మండలం రామవరం గ్రామ పంచాయతీ ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 1 లో తవిటి కొండ ప్రాంతంలో స్థలాలను కబ్జా చేసేందుకు బడా బాబులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఖాళీగా కనిపించినా వారు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఈ కొండ ప్రాంతంలో గతంలోనే సుమారు 1000 లారీల మట్టిని ఇష్టానుసారంగా తవ్వేసి క్రయవిక్రయాలు జరిపి లక్షల్లో కాసులను వారి జేబులో వేసుకున్నారు. అది చాలదు అన్నట్టు ఇప్పుడు బడాబాబుల కన్ను ఆ స్థలంపై పడింది గతంలో ల్యాండ్ పూలింగ్ కు ఇచ్చిన స్థలంలో మిగిలిన తవిటికొండ కొంత భాగంలో ఉంది. రాత్రికి రాత్రి గ్రావెల్ తరలించి అనంతరం అక్కడ స్థలంలో నీలగిరి మొక్కలు నాటారు ఎవరైనా అడిగితే మాదే అన్నట్లుగా సమాధానం చెప్తున్నారని, స్థానికలు వాపోతున్నారు. ఏదేమైనా ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తీయడమే తప్పు దానికి తోడు అన్నట్లుగా స్థలాన్ని కబ్జా చేస్తున్న ఆక్రమదారులపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుని చట్టపరంగా శిక్షించాలని అలాగే లోతుగా విచారణ జరిపి గతంలో తరలించిన గ్రావెల్ అక్రమ రవాణా పై విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించి ఆ స్థలంలో రెవెన్యూ బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

ప్రధాన రహదారి గోతులమయం!

- ఇబ్బందులు పడుతున్న బారీ వాహన సిబ్బంది - కార్లు , ద్విచక్ర వాహనాల యజమానులు

- నేతలు మారుతున్న మారని తలరాతలు!

విశాలాంధ్ర - గాజువాక : గాజువాక జోన్ పరిధి వై జంక్షన్ కూడలి నుంచి స్టీల్ ప్లాంట్ కు వెళ్లే ప్రధాన రహదారి లో దుర్గా నగర్ వద్ద బారీ గోతులు ఏర్పడడం తో అటువైపు వెళ్ళే ఉద్యోగులు, కాంటాక్ట్ కార్మికులు, విద్యార్థులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ జిల్లా సమితి సభ్యులు జి.ఆనంద్ తెలిపారు. దుర్గా నగర్ కూడలి వద్ద గొయ్యి ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా జీవిఎంసి అధికారులు పట్టించుకోక పోవడం దారుణమని అన్నారు. ప్రతి రోజు కొన్నివేల మంది ఈ రహదారి గుండా ప్రయాణిస్తున్నారు. దుర్గా నగర్ కూడలి నుంచి సి.ఎఫ్.ఎల్ కు వెళ్లే బారీ వాహనాలు ఈ రహదారి గుండానే ప్రయాణి స్తుంటాయి. అలాగే ఈ రహదారి లోనే సుందరయ్య కాలనీ రైల్వే బ్రిడ్జి వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడి నీరు నిలిచి పోయింది. దీంతో ఈ రహదారిలో ప్రయాణించే వాహన దారులు ప్రమాద బారిన పడుతున్నారు. చిన్న వర్షం పడినా ఈ రహదారిలో నీరు నిలిచి పోతుంది. ఈ రహదారి లోని గోతులు పూడ్చాలని అధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. తక్షణమే అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని సిపిఐ నేత ఆనంద్ విజ్ఞప్తి చేసారు.

కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టీల్ కంచాలు పంపిణీ

విశాలాంధ్ర - భీమిలి : అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం, నక్కులమామిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు భీమిలి, కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ శనివారం 40 స్టీల్ కంచాలను యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సంబంధిత పాఠశాల ఉపాధ్యాయుడు గుర్ల గోవిందరావు, ఫౌండేషన్ సభ్యులు ఊడికల శ్రీను, ఊడికల రాంబాబు, ఊడికల లక్ష్మణరావు, మొకర శంకర్రావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ పాలకమండల సభ్యుడిగా టీవీఎస్ మోటార్ కంపెనీ చైర్మన్ సుదర్శన్ వేణు

విశాలాంధ్ర - విశాఖపట్నం : టీవీఎస్ మోటార్ కంపెనీ చైర్మన్ సుదర్శన్ వేణును తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సభ్యుడిగా నియమితులయ్యారు. ఇది టీటీడీ ట్రస్ట్ బోర్డులో ఆయన రెండవ పదవీ కాలాన్ని సూచిస్తుంది. ఆయనతో పాటు ఆయన తండ్రి వేణు శ్రీనివాసన్, ఆయన భార్య తారా వేణు కూడా ఉన్నారు. ఇటీవల టీవీఎస్ మోటార్ కంపెనీ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్‌గా వేణు పదోన్నతి పొందిన తర్వాత ఈ నియామకం జరిగింది, ఇది భారతీయ బహుళజాతి తయారీదారులో కుటుంబం యొక్క నిరంతర నాయకత్వ వారసత్వాన్ని నొక్కి చెబుతుంది.

ఏసీఏ నూతన ప్రధాన కోచ్‌గా న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ గ్యారీ స్టీడ్

విదేశి కోచ్‌ను నియమించిన తొలి అసోసియేషన్‌గా ఘనత సాధించిన ఏసీఏ

విశాలాంధ్ర - పీఎంపాలెం : ఆంధ్ర క్రికెటర్ అసోసియేషన్ రాబోయే రంజీ క్రికెట్ సీజన్ 2025-26 కు అంతర్జాతీయ ఖ్యాతి పొందిన న్యూజిలాండ్ క్రికెట్ కోచ్ ,మాజీ క్రికెటర్ గ్యారీ స్టీడ్ ను సీనియర్ పురుషుల జట్టుకు ప్రధాన కోచ్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక రాష్ట్ర స్థాయి క్రికెట్ అసోసియేషన్ విదేశీ క్రికెటర్ ను కోచ్ గా నియమించడం ఇదే ప్రథమం. రాష్ట్రంలో క్రికెట్ ను ప్రోత్సహించే క్రమంలో నైపుణ్యమైన శిక్షణను అందించి అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ లో రాష్ట్ర క్రికెట్ ప్లేయర్స్ కు స్థానం దక్కాలన్న ధ్యేయంతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఈ నియామకాన్ని చేపట్టిందని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల న్యూజిలాండ్ క్రికెట్ జట్టుతో తన పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం ఆయనను ఏసీఏ ప్రధాన కోచ్ గా నియమించింది.గ్యారీ స్టీడ్ వ్యూహాత్మక చతురత అన్ని ఫార్మాట్లలో అద్భుత పనితీరు ట్రాక్ రికార్డు ను కలిగి ఉన్నదని , ఆయన నాయకత్వం ఏసీఏ క్రికెట్ ప్లేయర్స్ లో పోటీతత్వాన్ని పెంచుతుందని శ్రేష్ఠత, వృత్తి నైపుణ్యం అట్టడుగు స్థాయి అభివృద్ధికి దాని నిబద్ధతను బలోపేతం చేస్తుందని తెలిపారు. అలాగే ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి సనా సతీష్ బాబు నూతన కోచ్ నియామకం తో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ క్రీడాకారులు మరింత రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఏసీఏ గౌరవ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ "గ్యారీ స్టెడ్ కేవలం కోచ్ మాత్రమే కాదు - అతను సంస్కృతిని నిర్మించేవాడు. ప్రతిభ అభివృద్ధి, వ్యూహాత్మక నిర్ణయాలు, కార్యాచరణ క్రమశిక్షణలో స్థాయిని పెంచాలనే ఏసీఏ ఉద్దేశ్యాన్ని ఆయన రాక సూచిస్తుంది. ఆయనను జట్టులోకి తీసుకోవడం పట్ల ఏసీఏ చాలా సంతోషంగా ఉంది ఆయన మార్గదర్శకత్వం మా ఆటగాళ్లకు కోచ్‌లకు స్ఫూర్తినిస్తుందని మేము విశ్వసిస్తున్నామని అన్నారు. ఏసీఏ కార్యదర్శి సనా సతీష్ బాబు మాట్లాడుతూ "గ్యారీ నియామకం ఆంధ్ర క్రికెట్‌లో ఒక కొత్త అధ్యాయాన్ని సూచిస్తుంది. అతని ప్రపంచ అనుభవం మరియు విలువలు సమగ్రత, పనితీరు మరియు సమగ్రతలో పాతుకుపోయిన వారసత్వాన్ని నిర్మించాలనే ఏసీఏ దార్శనికతకు సరిగ్గా సరిపోతాయి. మేము ఆయనను మా క్రికెట్ కుటుంబానికి హృదయపూర్వకంగా స్వాగతిసు న్నాము రాబోయే సీజన్ కోసం ఎదురు చూస్తున్నామని అన్నరు. గ్యారీ స్టీడ్ - ప్రధాన కోచ్ మాట్లాడుతూ "2025%-%26 సీజన్‌లో సీనియర్ పురుషుల జట్టుకు ప్రధాన కోచ్‌గా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లో చేరడం నాకు గౌరవంగా ఉంది. ఇక్కడ క్రికెట్ పట్ల మక్కువ స్పష్టంగా కనిపిస్తుంది , వారసత్వం , అభివృద్ధి పట్ల ఏసీఏ యొక్క నిబద్ధత నాలో లోతుగా ప్రతిధ్వనిస్తుంది. హృదయపూర్వకంగా ఉద్దేశ్యంతో పోటీపడే జట్టును నిర్మించడానికి ఆటగాళ్ళు, సహాయక సిబ్బంది నాయకత్వంతో దగ్గరగా పనిచేయడానికి నేను ఎదురు చూస్తున్నాను.' అన్నారు.

దబ్బంద ఎడ్మిన్ మచ్చలేని మనిషిగా మజ్జి సన్యాసిరావు

- పలు విభాగాల్లో విధులు నిర్వహణ - అందరి మన్ననలు పొందిన ఏకైక వ్యక్తి

విశాలాంధ్ర - ఆనందపురం : 1974 సంవత్సరంలో దబ్బంద కరణం , సీనియర్ అసిస్టెంట్, మెడికల్ డిపార్ట్మెంట్ పలు విభాగాలు సేవలు అందించి, 1984 తర్వాత విలేజ్ అసిస్టెంట్గా కేడీపేట మండలం పాయకరావుపేట భీమిలి మండలాల్లో విలేజ్ అసిస్టెంట్‌గా కార్యకలాపాలు సాగించారు. నీతి నిజాయితీ మారుపేరుగా తన గ్రామంలో ప్రతి అండగా ఆదరించే వ్యక్తిగా కీర్తిశేషులు మజ్జి సన్యాసిరావును చెప్పవచ్చు. తర్లువాడ గ్రామం అభివృద్ధికి కీలక పాత్ర పోషించి అన్ని విభాగాల్లో పనిచేసి ఎటువంటి మచ్చలేని వ్యక్తి, కీర్తిశేషులు మజ్జి సుబ్బారావు, వరహాలమ్మ దంపతులకు జన్మించిన సన్యాసిరావు అప్పట్లో పలు విభాగాల్లో సేవలు అందించారు. విద్యాభ్యాసం సారిపల్లి గ్రామంలో విద్యాభ్యాసాన్ని ప్రారంభించి, రామతీర్థం జిల్లా పరిషత్ ఉన్నత విద్య, ఎస్ ఎస్ ఎల్ సి విజయనగరం మహారాజ కళాశాలలో పియుసి లో ఉత్తీర్ణత, 1970 సంవత్సరంలో తర్లువాడ మునసబి గారి కుమార్తె లక్ష్మి తో వివాహం. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె, అనంతరం 1974 సంవత్సరంలో ఉద్యోగ నిర్వహణ, స్వర్గీయ ఎన్టీఆర్ ప్రతిపాదన కారణంగా గ్రామాధికారులు వ్యవస్థ రద్దు కారణంగా డి ఎం ఓ కార్యాలయంలో చేరి అనేక సేవలందించారు. 2008 సంవత్సరంలో పదవి విరమణ పొందారు. 2022 సంవత్సరంలో స్వర్గస్తులయ్యారు. గత కొన్ని రోజులకు ముందు ఆరోగ్య పరిస్థితులు కారణంగా ఆయన భార్య లక్ష్మి కూడా కాలం చేశారు. వీరి సంతానంలో మొదటి కొడుకు మజ్జి శ్రీనివాసరావు రిటైర్డ్ ఆర్మీ, ప్రస్తుతం విశాఖ జిల్లా జనసేన పార్టీ రూరల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వారి తల్లిదండ్రులు సన్యాసిరావు లక్ష్మి,సంస్మరణ దినం 16/9/2025 తేదీన తర్లు వాడ గ్రామంలో నిర్వహిస్తున్నట్లు జనసేన జిల్లా కార్యదర్శి శ్రీను తెలిపారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్ వలన విస్తృత ప్రయోజనాలు

- ఉచిత వ్యాక్సిన్ శిబిరానికి విశేష స్పందన

- లైన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్పర్సన్ డాక్టర్ శిరీన్ రెహమాన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ : బాలికలు హెచ్‌పివి వ్యాక్సిన్ వేసుకోవడం వలన విస్తృతమైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని లైన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ శిరీన్ రహ్మాన్ అన్నారు. లైన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖపట్నం పోర్టు అధారిటీ సి. ఎస్. ఆర్. నిధులతో లయన్స్ క్యాన్సర్ అండ్ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఉచిత హెచ్. పి. వి. వ్యాక్సిన్ శిబిరాన్ని శనివారం శిరీన్ రెహమాన్ ప్రారంభించారు. మొదటిరోజు శిబిరంలో 360 మంది 9 నుంచి 14 ఏళ్ళ మధ్య వయసున్న బాలికలు వచ్చి వ్యాక్సిన్లు వేసుకున్నారు. ఈ మధ్యకాలంలో సర్వైకల్ క్యాన్సర్ బారినపడి అనేకమంది మహిళలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాక్సిన్లు అటువంటి వ్యాధి సంక్రమించకుండా నిరోధిస్తాయని చెప్పారు. 14, 15, 16 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు లయన్స్ క్యాన్సర్ అండ్ జనరల్ ఆసుపత్రిలో ఉచితంగా ఈ వ్యాఖ్యలను వేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నగరంలోని బాలికలు వినియోగించు కోవాలని ఆమె కోరారు.

హెచ్.పి. వి. సాధారణ టీకా కంటే ఉత్తమమైనది : ఆచార్య వి.ఉమామహేశ్వరరావు

లయన్స్ క్యాన్సర్ అండ్ జనరల్ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్ట్, ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వి ఉమామహేశ్వరరావు వ్యాక్సిన్ ప్రయోజనాలను వివరించారు. ఇది కౌమారదశ (9 - 14 మధ్య వయసు) బహుళ క్యాన్సర్ల నుండి యువతను రక్షించడానికి ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు. 9 సంవత్సరాల వయస్సు నుండి టీకాలు వేయడం ప్రారంభించడం వలన హ్యూమన్ పాపిల్లోమావైరస్, సంబంధిత వ్యాధుల నుండి దీర్ఘకాలిక రక్షణ లభిస్తుందన్నారు. ఈ వ్యాక్సిన్ వేసుకోవడం వలన శాశ్వత రోగనిరోధక శక్తి, గర్భాశయ క్యాన్సర్, జననేంద్రియ మొటిమలు, గొంతు క్యాన్సర్ల నుండి బాలికలు, అబ్బాయిలను రక్షించడంలో సహాయ పడతాయ పడతాయని తెలియజేశారు. ఈ హ్యూమన్ పాపిల్లోమావైరస్ (హెచ్. పి. వి) చర్మం-తో-చర్మం సంబంధం ద్వారా, ప్రధానంగా లైంగిక కార్యకలాపాల సమయంలో వ్యాపించే అత్యంత సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్లలో ఒకటిన్నారు. వ్యాక్సిన్ కౌమార దశలో ఇచ్చినప్పుడు ప్రభావవంతంగా పనిచేస్తుందన్నారు. మొత్తం 700 మంది వరకు ఈ శిబిరంలో వ్యాక్సిన్లు అందిస్తారు. కౌమార దశ బాలికలకు రెండు మోతాదులు వ్యాక్సిన్లు వేసుకోవాలన్నారు. మొదటి డోసు వేసుకున్న వారికి రెండవ డోసు 2026మార్చిలో వేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ శిబిరంలో లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ మేనేజింగ్ ట్రస్టీ బి.రవిచంద్ర, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ 93వ వార్డులో ఎమ్మెల్యే పంచకర్ల మార్నింగ్ వాక్ విత్ పబ్లిక్

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గం జీవీఎంసీ 93వ వార్డులో మార్నింగ్ వాక్ విత్ పబ్లిక్ కార్యక్రమంలో జనసేన పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు. శనివారం ఉదయం 7 గంటల నుండి స్థానిక కార్పొరేటర్ రాపర్తి త్రివేణీ కన్నా, జీవీఎంసీ 8 జోనల్ ఇంచార్జ్ కమిషనర్ శంకర్రావుతో కలిసి జీవీఎంసీ 93 వ వార్డు ప్రహ్లాదపురం పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కలిసి వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై సంభందిత అధికారులకు నివేదించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రహ్లాదపురం పరిసర ప్రాంతాల ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న ఇళ్ల మీదుగా ఉన్న విద్యుత్ వైర్లు సమస్య, రేషన్ డిపో సమస్య, పాడైపోయిన రోడ్లు , డ్రైన్స్ శిథిల వ్యవస్థకు వచ్చిన వాటర్ ట్యాంక్ తొలగింపు , రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు మార్చడం, పాడైపోయిన కలవర్టులు పునర్నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచుట తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆ సమస్యలను పరిష్కారం కోసం స్థానిక కార్పొరేటర్, జోనల్ కమిషనర్, ఇంజనీరింగ్ విభాగం అదికారులకు ఆదేశాలు జారీ చేసి త్వరితగతిన నివేదిక అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో జోన్ 8 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దిలీప్, డిప్యూటీ ఎద్యుకేటివ్ ఇంజనీర్ ప్రవీణ్, ఏ ఈ కుసుమ, వార్డు అధ్యక్షులు ఆది బాబు, వార్డు నాయకులు రాపర్తి శైలజ కన్నా, కోరుకొండ వరహాలు, దాసరి శ్రీనివాసరావు, మాధవ, గంగా వరహాలు, ఉషా రాణి, బర్రెడ్డి శ్రీను, పల్లా రవి, మహేష్,సేనాపతి సోమశేఖర్, పిన్నింటి పార్వతి, రాపర్తి కిషోర్, బంటు సురేష్, గోరపెల్లి స్వామి నాయుడు, ఎర్రి బాబు,లక్కీ గోవింద్, చీరా రాజు, తనకాల శ్రీనివాసరావు, అయితే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సన్ స్కూల్‌లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - భీమిలి : భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్, సన్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారిచే స్థానిక సన్ స్కూల్ నందు శనివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కంటి వైద్య శిబిరంలో సుమారు 198 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 40 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసారు.అదేవిధంగా కళ్ళజోడు అవసరమైన 34 మంది పేద వృద్ధులకు త్వరలో ఉచిత కళ్ళజోడు ఇవ్వడం జరుగుతుందని భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కైతపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ డి. కృష్ణ దీపక్, క్యాంప్ కోఆర్డినేటర్ వై. పైడిరాజు, బిఎన్ డబ్ల్యు సభ్యులు ముసునూరి సూర్య శ్రీనివాస్, వెంపాడ శ్రీనివాసరెడ్డి, వాండ్రసి సతీష్,కాళ్ల సన్నీ,శివదళాయ్, కాకర్ల సురేష్, సన్ స్కూల్ పాఠశాల సిబ్బంది అరుణ్ తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీ లావణ్య సౌజన్యంలో హెరాటల్ బ్లిస్ క్యాటరింగ్, సన్ స్కూల్ ఎన్సిసి విద్యార్థులు తమ పూర్తి సహాయ సహకారములు అందించారు.

సైబర్ మోసాల పట్ల జాగ్రత్త వహించాలి

బజాజ్ ఫైనాన్స్ అవగాహన కార్యక్రమంలో వక్తలు

విశాలాంధ్ర - విశాఖపట్నం : వివిధ రకాల సైబర్ బెదిరింపులు, మోసాల పట్ల అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని పలువురు వక్తలు సూచించారు. మోసగాళ్ల నుండి పౌరుల ఆర్థిక వ్యవస్థను రక్షించే మార్గాల గురించి వారికి తెలియజేయడానికి బజాజ్ ఫైనాన్స్ యొక్క 100 వ నగర సైబర్ సెక్యూరిటీ కార్యక్రమంలో భాగంగా విశాఖలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారతదేశంలో అతిపెద్ద ప్రైవేట్ రంగ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్ బీ ఎఫ్సి), బజాజ్ ఫిన్‌సర్వ్ బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 'నాక్‌ఔట్ డిజిటల్ ఫ్రాడ్' పేరుతో సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం ద్వారా డిజిటల్ వినియోగదారులకు వివిధ రకాల సైబర్ ముప్పులు, ఆర్థిక భద్రత కోసం పాటించాల్సిన ఉత్తమ పద్ధతులపై సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో గాజువాక పోలీస్ ఇన్స్పెక్టర్ ఎ.పార్థసారథి, కె.శ్రీనివాసరావు, ఎస్సై రవి కిషోర్, పాల్గొన్నారు. విశాఖ మరియు పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా చోటు చేసుకుంటున్న సైబర్ మోసాలపై వారు విశదీకరించారు. నకిలీ ఓటీపి మోసాలు, ఫిషింగ్ దందాలు, డిజిటల్ అరెస్టులు, ఆర్థిక రుణ మోసాలు, పెన్షన్ మోసాలు తదితర విభిన్న రకాల మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.